అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 339 | వరంగల్ | గురువారం, 22 అక్టోబర్ 2026 | పేజీలు: 07

లంచం ఆరోపణలపై ఇద్దరు ప్రాజెక్టు అధికారులు అరెస్టు

- బిల్లుల చెల్లింపునకు 10 నుంచి 25 శాతం డిమాండ్..
- రూ.39.17 లక్షలు బదిలీ అయినట్లు గుర్తింపు



భూపాలపల్లి జిల్లాలోని భాగీరథిపేట ప్రాజెక్టులో పీఎంకేఎస్‌వై 2.0 విభాగానికి చెందిన ప్రాజెక్టు అధికారి సతీశ్‌రెడ్డి, సాంకేతిక అధికారి రాజును అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వరంగల్ రేంజ్ అధికారులు గురువారం అరెస్టు చేశారు. - *అక్షరశక్తి, భూపాలపల్లి*



బీరుపై రూ.50కిపైగా అదనపు వసూలు?

పండగ వేళ పోటాపోటీగా విక్రయాలు..

ఎక్సైజ్ అధికారుల పర్యవేక్షణ పై విమర్శలు

దసరా కిక్.. మద్యం అమ్మకాలు రూ.86.14 కోట్లు!

5

దసరా పండగ వేళ ఉమ్మడి వరంగల్ జిల్లాలో మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. పండగ సందడిని ఆసరాగా చేసుకున్న మద్యం వ్యాపారులు భారీగా విక్రయాలు చేపట్టారు. ఈ నెల 17, 19, 21 తేదీల్లో కలిపి ఉమ్మడి వరంగల్ జిల్లాలో రూ.86.14 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్ ఉప కమిషనర్ దత్తురాజ్ గౌడ్ వెల్లడించారు. మూడు రోజుల వ్యవధిలోనే భారీ స్థాయిలో మద్యం అమ్మకాలు జరగడం గమనార్హం. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో బెల్టు షాపుల నిర్వహణ, అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలు చాలా వినిపించాయి. - *అక్షరశక్తి, ప్రధాన ప్రతినిధి*

విచ్చలవిడిగా బెల్టు షాపుల దందా

ముదిరాజ్‌లను బీసీఏలో చేర్చే అంశంపై అధ్యయనం

- ట్యాంక్‌బండ్ పరిసరాల్లో పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాలు
- కులగణన ఆధారంగా న్యాయపరమైన చిక్కులు లేకుండా నిర్ణయం
- మంత్రివర్గ ఉపసంఘం ద్వారా సమగ్ర పరిశీలన
- బహుజన పోరాటయోధులకు చరిత్రలో సముచిత స్థానం కల్పిస్తాం
- పండుగ సాయన్న 174వ జయంతి సభలో సీఎం రేవంత్‌రెడ్డి



ఉద్యమమే ఊపిరిగా.. జిల్లా పార్టీ పగ్గాలు వేణుకు!

- తెలంగాణ రక్షణ సేన మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా గంధసిరి వేణు
- విద్యార్థి దశ నుంచే తెలంగాణ ఉద్యమంలో క్రియాశీల పాత్ర
- 14 ఏళ్లకే కుటుంబ పోషణ కోసం కులవృత్తిలోకి..
- జయశంకర్ స్ఫూర్తితో గ్రామగ్రామాన తెలంగాణ భావజాల వ్యాప్తి
- తెలంగాణ జాగృతిలో కీలక భూమిక.. కవితతో కొనసాగుతున్న రాజకీయ ప్రస్థానం
- ఉద్యమ నేపథ్యానికి ప్రాధాన్యమిస్తూ జిల్లా బాధ్యతలు







5

పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

పోలీసుల సంక్షేమం, అమరవీరుల కుటుంబాల ఆదరణ మనందరి బాధ్యత

పోలీస్ అమరవీరుల త్యాగాలు దేశానికి గర్వకారణమని పోలీస్ కానిస్టేబుల్ నమిండ్ల కిషోర్ కుమార్ పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం త్యాగం చేస్తున్న పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయమని అన్నారు.

ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న నిర్వహించే పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులకు నివాళులర్పించాలని పిలుపునిచ్చారు. 1959లో లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో జరిగిన దాడిలో ప్రాణాలు కోల్పోయిన పది మంది పోలీసు సిబ్బంది స్మారకంగా ఈ రోజును పాటిస్తున్నామని పేర్కొన్నారు.

అమరవీరుల మరణంతో వారి కుటుంబాలు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నాయని, భార్యాభర్తలు, పిల్లలు, వృద్ధ తల్లిదండ్రులు తీరని లోటును అనుభవిస్తున్నారని తెలిపారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం అందించే పరిహారం, పింఛను, ఉద్యోగ అవకాశాలు, వైద్య సహాయంతో పాటు సమాజం నుంచి గౌరవం, మానసిక ధైర్యం, నిరంతర సహకారం అవసరమని అన్నారు.

పోలీసులు విధుల్లో భాగంగా ఎక్కువ గంటలు పనిచేయడం, సెలవులు లభించకపోవడం, కుటుంబానికి సమయం కేటాయించలేకపోవడం, సిబ్బంది కొరత, పని ఒత్తిడి, ఆరోగ్య సమస్యలు వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని వివరించారు. పోలీసుల సంక్షేమం కోసం తగిన సిబ్బంది నియామకం, న్యాయమైన సెలవులు, విశ్రాంతి, ఆరోగ్య పరీక్షలు, మానసిక ఆరోగ్య సహాయం కల్పించాలని సూచించారు.

ప్రజల భద్రత కోసం అహర్నిశలు శ్రమించే పోలీసుల సేవలను గుర్తించి, వారికి గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. పోలీసుల సంక్షేమమే సమర్థవంతమైన పోలీస్ వ్యవస్థకు పునాది అని, అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు వారి కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు.

పోలీస్ అమరవీరులకు ఘన నివాళులు.



నమిండ్ల
కిషోర్ కుమార్, PC
7386361414

ఘనంగా పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి

అక్షరశక్తి, హనుమకొండ: పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలను హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, అధికారులు, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొని పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న ధైర్యసాహసాలు, ప్రజల కోసం చేసిన సేవలను అధికారులు, ముదిరాజ్ సంఘం ప్రతినిధులు గుర్తుచేసుకున్నారు. సమాజంలో అణగారిన వర్గాల కోసం పోరాడిన ఆయన సేవలు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, రాష్ట్ర మేర కార్పొరేషన్ చైర్మన్ సంగు వెంకట్రాజం, ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సంపూర్ణ పాల్గొన్నారు. సంఘాల ప్రతినిధులు దేవేందర్ ముదిరాజ్, పొన్నం రాజ్, పులి రజనీకాంత్, పొన్నం మొగిలి, బండి సారంగపాణి తదితరులు హాజరయ్యారు.



నూతన బస్ స్టేషన్ పనులు వేగవంతం





- **ప్రయాణికుల సౌకర్యాలకు ప్రాధాన్యం**
- **మంత్రి దనసరి అనసూయ సీతక్క.**

అక్షరశక్తి,ములుగు: నూతనంగా నిర్మిస్తున్న మోడల్ బస్‌స్టాండ్ పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి అనసూయ సీతక్క ములుగు జిల్లా కేంద్రంలోని మోడల్ బస్‌స్టాండ్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించడంలో బస్‌స్టాండ్ కీలకమని తెలిపారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిర్మాణ పనులను పూర్తి చేయాలని సూచించారు. పనుల వేగంతో పాటు నాణ్యతకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని, అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రయాణికులు సురక్షితంగా రాకపోకలు సాగించేలా ఫ్లోరింగ్ పనులు చేపట్టాలని సూచించారు. తాగునీరు, మరుగుదొడ్లు, కూర్చునే సదుపాయాలు, విద్యుత్ దీపాలు వంటి మౌలిక సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మిగిలిన పనులను సమన్వయంతో పూర్తి చేసి, బస్‌స్టాండ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కళ్యాణి,పంచాయతీ రాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో కొమురం భీమ్ 125వ జయంతి



అక్షరశక్తి, గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని కొమరం భీం విగ్రహం వద్ద ఆయన 125వ జయంతిని గూడూరు ఆదివాసి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, యువకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 1901 అక్టోబర్ 22న జన్మించినటువంటి ఆదివాసీ యోధుడు, గోండు బొబ్బిలి, కొమరం భీమ్ "జల్ జంగిల్ జమీన్" కోసం పోరాటం చేశారు. ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయాలపై నిజాంతో పోరాటం చేసి ఆదివాసి హక్కుల కోసం తన ప్రాణాలను సైతం కోల్పోయిన మహానీయుడు. ఆదివాసీల ఆరాధ్య దేవుడు కొమరం భీమ్. కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గూడూర్ ఆదివాసీ ఉద్యోగులు అయిలబోయిన వీరయ్య, బత్తుల శ్రీనివాస్, మోకాళ్ళ వెంకన్న, పడిగ రమేష్, రేగ రమేష్, బూర్ఖ సత్యం, రేగ సాంబయ్య, లింగాల లక్ష్మీనారాయణ, తుడుం దెబ్బ నాయకులు అర్రేం వీరస్వామి, దారం మహేందర్, చంద్రయ్య దొర అలాగే ఆదివాసి యువకులు చాపల శ్రీపత్, దారం ఉదయ్, అల్లెం సాయి, పొనక వినోద్, సోలం సందీప్, జోగా సాయి,ప్రశాంత్, నవీన్,రవీందర్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మురళి నాయక్‌ను సన్మానించిన సర్పంచ్ దంపతులు



అక్షరశక్తి, గూడూరు: గూడూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలు నాయక్ నివాసానికి మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ మర్యాదపూర్వకంగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలు నాయక్, స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ భేటీలో గ్రామాభివృద్ధి, స్థానిక సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో గూడూరు మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి ఎండి రసూల్, టౌన్ కార్యదర్శి సూర శ్రీను, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కుంచపు సాంబయ్య, వాంకుడోత్ సోమన్న, పంజరబోయిన శ్రీను, సూర రాంబాబు, పిజ్జం మధుకర్, డ్రైవర్ సాంబయ్య, కాంతా చారి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గూడూర్ టౌన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలు

అక్షరశక్తి, హనుమకొండ: కేయూ ఫస్ట్ గేట్ వద్ద ఉన్న శారద, ప్రగతి హై స్కూల్ స్కూల్లో చదివిన విద్యార్థులు పాత జ్ఞాపకాలని గుర్తు చేసుకుంటూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 2000, 2001 లో సంవత్సరం పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు అందరూ కలిసి కరస్పాండెంట్ పరమేశ్వర స్వామిని సన్మానించారు. ఉపాధ్యాయులు బాలకృష్ణ భగవాన్ రెడ్డి శ్రీలత సదానందం దశరథం మురళి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించుకున్నారు.ఈ మధ్యకాలంలో మరణించిన విద్యార్థులు శివశంకర్ సంధ్యారాణి హరిత అజయ్ విద్యార్థులకు సంతాపం ప్రకటించారు.



క్యూఎఐఈ యాప్‌తో పెట్టుబడి మోసాలు

- **తెలంగాణలో 56 కేసులు నమోదు..**
  అప్రమత్తంగా ఉండాలి: సీపీ ఎన్. శ్వేత



అక్షరశక్తి, హనుమకొండ క్రైమ్: ఆన్‌లైన్ పెట్టుబడుల పేరుతో జరుగుతున్న సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత సూచించారు. క్యూఎఐఈ (క్వాంటమ్ వెస్ట్ స్టాక్ ఎక్స్చేంజ్) యాప్ ద్వారా పెట్టుబడుల మోసాలు జరుగుతున్నాయని, ఈ తరహా మోసాలపై తెలంగాణలో ఇప్పటికే 56 కేసులు నమోదయ్యాయని తెలిపారు. యాప్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని, ఇతరులను చేర్పిస్తే అదనపు ఆదాయం ఇస్తామని సైబర్ నేరగాళ్లు నమ్మిస్తున్నారని పేర్కొన్నారు. తెలియని వ్యక్తులు పంపే యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దని, ధ్రువీకరించని వేదికల్లో పెట్టుబడులు పెట్టవద్దని సూచించారు. ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 జాతీయ సైబర్ నేరాల సహాయ వాణికి ఫోన్ చేయాలని లేదా www.cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేయాలని సీపీ సూచించారు.

దసరా కిక్.. మద్యం అమ్మకాలు రూ.86.14 కోట్లు!

- విచ్చలవిడిగా బెల్టు షాపుల దందా
- బీరుపై రూ.50కిపైగా అదనపు వసూలు?
- పండగ వేళ పోటాపోటీగా విక్రయాలు..
- ఎక్సైజ్ అధికారుల పర్యవేక్షణ పై విమర్శలు



అక్షరశక్తి, ప్రధాన ప్రతినిధి: దసరా పండగ వేళ ఉమ్మడి వరంగల్ జిల్లాలో మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. పండగ సందడిని ఆసరాగా చేసుకున్న మద్యం వ్యాపారులు భారీగా విక్రయాలు చేపట్టారు. ఈ నెల 17, 19, 21 తేదీల్లో కలిపి ఉమ్మడి వరంగల్ జిల్లాలో రూ.86.14 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్ ఉప కమిషనర్ దత్తురాజ్ గౌడ్ వెల్లడించారు. మూడు రోజుల వ్యవధిలోనే భారీ స్థాయిలో మద్యం అమ్మకాలు జరగడం గమనార్హం. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో బెల్టు షాపుల నిర్వహణ, అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలు చాలా వినిపించాయి.

పండగ వేళ భారీ విక్రయాలు

దసరా పండగ సందర్భంగా మద్యం దుకాణాల వద్ద కొనుగోళ్లు పెరిగాయి. పండగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని వ్యాపారులు పెద్ద మొత్తంలో మద్యం నిల్వలు ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది. వీటిలో బెల్టు షాపుల హవా బాగా నడిచినట్లు తెలుస్తున్నది. ఎక్సైజ్ శాఖ అధికారులు సేల్స్ ఉండే షాపులకు ఒక రేటు, సాధారణ షాపులకు ఒక రేటుగా నిర్ణయించి వసూళ్లకు డిమాండ్ చేసినట్లు తెలుస్తున్నది.

పండగ చేసుకున్నారు...

ఈ సారి దసరా పండగ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో మద్యం సేల్స్ వంద కోట్ల వరకు జరిగినట్లు తెలిసింది. ఎక్సైజ్ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం మూడు రోజుల విక్రయాల్లో మొత్తం 60,904 లిక్కర్ కేసులు, 1,71,903 బీరు కేసులు అమ్ముడయ్యాయి. జిల్లాల వారీగా మద్యం విక్రయాల ద్వారా వచ్చిన ఆదాయంలో హనుమకొండ జిల్లా అగ్రస్థానంలో నిలిచింది.

జిల్లాల వారీగా ఆదాయం వివరాలు..

హనుమకొండ జిల్లాలో రూ.26.62 కోట్లు, వరంగల్ జిల్లాలో రూ.15.56కోట్లు, జనగామ జిల్లాలో రూ.5.15 కోట్లు, మహబూబాబాద్ జిల్లాలో రూ.15.86 కోట్లు, భూపాలపల్లి, ములుగు జిల్లాలు కలిపి రూ.12.32 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్ శాఖ వివరాలు సూచిస్తున్నాయి. ఈ మొత్తం ఆదాయం రూ.86.14 కోట్లు కాగా, బెల్టు షాపుల ద్వారా మరో ఇరవై కోట్ల రూపాయల బిజినెస్ జరిగినట్టు తెలుస్తున్నది.

గ్రామాల్లో బెల్టు షాపుల జోరు...

పల్లెల్లో బెల్టు షాపుల ద్వారా మద్యం విక్రయాలు విచ్చలవిడిగా జరిగాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ప్రధాన మద్యం దుకాణాలకు అనుబంధంగా బెల్టు షాపులు ఏర్పాటు చేసి, పండగ వేళ అధిక ధరలకు మద్యం విక్రయించినట్లు కొనుగోలుదారులు చెబుతున్నారు. ముఖ్యంగా ఒక్కో బీరు సీసా పై రూ.50కిపైగా అదనంగా వసూలు చేశారని మద్యం ప్రియులు ఆరోపిస్తున్నారు. అధికారిక మద్యం దుకాణాలకు దూరంగా ఉన్న గ్రామాల్లో ఇటువంటి విక్రయాలు ఎక్కువగా జరిగినట్లు తెలుస్తున్నది.

అదనపు ధరల వసూళ్లపై ఆరోపణలు

పండగ సమయంలో మద్యం కోసం డిమాండ్ పెరగడంతో కొన్ని చోట్ల వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయించినట్లు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. సాధారణ ధరకు మద్యం అందుబాటులో లేకపోవడం, బెల్టు షాపుల్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి రావడం వల్ల మందుబాబుల జేబులకు చిల్లు పడిందని చెబుతున్నారు. దీనికి ప్రధాన కారణం ఎక్సైజ్ శాఖ అధికారులే అని తెలుస్తున్నది. డిమాండ్ ను బట్టి ప్రతి దుకాణం నుంచి ఎక్సైజ్ అధికారులకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు ముడుపులు అందినట్లు సమాచారం ఉందనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. మద్యం వ్యాపారులు, ఎక్సైజ్ శాఖ లో కొందరు అధికారులు కాసుల దసరా పండగ బాగా చేసుకున్నారని అంటున్నారు.

ఎక్సైజ్ పర్యవేక్షణ ఎక్కడ?

పండగల సమయంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అక్రమ విక్రయాలను అరికట్టాల్సిన అధికారులు తగిన చర్యలు తీసుకోలేదని తెలుస్తున్నది. నెల ముందే పండగ సీజన్ ను దృష్టిలో ఉంచుకొని నగరంలో, గ్రామాల్లో ప్రత్యేక మద్యం దుకాణాలు(బెల్ట్ షాపులు) ఏర్పాటు చేసుకున్నాయి. ఇది ఎక్సైజ్ శాఖ అధికారులకు తెలిసి కూడా మామూళ్లు వసూలు చేసి చూసీ చూడకుండా వ్యవహరించారని తెలిసింది. మద్యం సిండికేట్ ను ప్రోత్సహించి, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

12 లక్షల ఎకరాల్లో పంట ఎండిపోతోంది

- ఇప్పటికీ మన ప్రభుత్వం కరువు మండలాలు ప్రకటించలేదు
- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు



అక్షరశక్తి, గజ్వేల్ : రోమ్ నగరం తగలబడిపోతుంటే ఫిడేల్ వాయించినట్టు ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కరువు పరిస్థితుల్లో ప్రజలను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైపోయాడని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. ఇది కాలం తెచ్చిన కరువు కాదని మేం గతంలో కూడా చాలాసార్లు చెప్పామన్నారు.. ...10 నెలల క్రితమే ఎల్‌నినో వస్తుందని కరువు పరిస్థితులు ఏర్పడుతాయని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వాలను హెచ్చరించారు. కానీ మన రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్రపోయి ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఇవాళ దాదాపు 12 లక్షల ఎకరాల్లో పంట ఎండిపోతుంది.. పత్తి లాంటి పంట కనీసం దిగుబడి కాదు.. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. పత్తి దిగుబడి బాగా తగ్గిపోయి ఎకరాకు 23 క్వింటాళ్లు కూడా రానట్వంటి పరిస్థితి ఉన్నది. పత్తి దిగుబడి బాగా తగ్గిపోయిందన్నారు హరీశ్ రావు.. 1012 లక్షల ఎకరాల్లో పంటలు బాగా ఎండిపోతున్నాయి. ఇప్పటికే అనేక జిల్లాల్లో ప్రజలు తాగునీటికి, సాగునీటికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. పక్క రాష్ట్రాలు ఇప్పటికే కరువు మండలాలు ప్రకటించాయి. ఈ దేశంలో కొన్ని రాష్ట్రాలు తక్షణ ఆర్థిక సాయాన్ని ప్రకటించి రైతాంగానికి అందిస్తున్నాయి. కొన్ని రాష్ట్రాలు తాగునీటి ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం జిల్లా కలెక్టర్లకు నిధులు విడుదల చేస్తున్నారు.. కానీ ఇంతవరకు మన తెలంగాణ ప్రభుత్వం కరువు మండలాలు ప్రకటించలేదు.. తక్షణ ఆర్థిక సాయం ప్రకటించలేదు.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం లేదు.. విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాల విషయంలో ఫెయిల్ అయిపోయారన్నారు. ఇయ్యాళ్ల కొందామంటే కరెంట్ లేదని రేవంత్ రెడ్డి బీద అరుపులు మాట్లాడుతున్నారని హరీశ్ రావు మండిపడ్డారు.

ఆదివాసీల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం

కొమురం భీమ్ జయంతి సభలో కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి



అక్షరశక్తి, వరంగల్: ఆదివాసీల హక్కుల సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడు కొమురం భీమ్ అని కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకుల పతి ఆచార్య కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ ఎస్సీ, ఎస్టీ సెల్ సంచాలకుడు డాక్టర్ ఎ. రాజు అధ్యక్షతన పరిపాలనా భవనం ప్రాంగణంలో నిర్వహించిన కొమురం భీమ్ జయంతి సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ 'జల్, జంగల్, జమీన్' నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం కొమురం భీమ్ పోరాటం సాగించారని గుర్తుచేశారు. ఆయన పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆయన జయంతిని అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రమ్ మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం నాటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన ధీరుడు కొమురం భీమ్ అని అన్నారు. జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) సమన్వయకర్త ఆచార్య ఈసం నారాయణ మాట్లాడుతూ గిరిజనుల్లో హక్కుల పట్ల చైతన్యం కలిగించి, వారిని సంఘటితం చేసిన మహనీయుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు ఆచార్య సురేష్‌లాల్, డాక్టర్ చిర్రా రాజు, ఓఎస్‌డీ ఆచార్య బి. వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు. విశ్వవిద్యాలయ అధ్యాపకులు, పరిశోధకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు హాజరయ్యారు.

గిరిజన హక్కుల కోసం పోరాడిన యోధుడు కొమురం భీమ్



అక్షరశక్తి, గూడూరు: గిరిజనుల హక్కుల సాధన కోసం పోరాడిన కొమురం భీమ్ జీవితం ఆదివాసీ సమాజానికి, యువతకు స్ఫూర్తిదాయకమని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ గూడూరు మండల అధ్యక్షుడు ముయ్యబోయిన వెంకన్న అన్నారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మట్టేవాడ గ్రామంలో కొమురం భీమ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముయ్యబోయిన వెంకన్న మాట్లాడుతూ గోండు గిరిజన కుటుంబంలో జన్మించిన కొమురం భీమ్ తన జీవితంలో ఎదురైన అన్యాయాలు, గిరిజనులపై జరిగిన దోపిడీకి వ్యతిరేకంగా పోరాట యోధుడిగా ఎదిగారని తెలిపారు. 'జల్, జంగల్, జమీన్' నినాదంతో గిరిజనుల హక్కుల కోసం నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ దొర బిజ్జా పొట్టయ్య, పటేల్ రేగ వెంకటేశ్వర్లు, మండల పీసా మొబిలైజర్ ఆగబోయిన సమ్మయ్య, పీసా కార్యదర్శి బిజ్జా నరసయ్య, ఆదివాసీ ఉపాధ్యాయులు రేగ పాపారావు, పూనెం భద్రయ్య, రేగ వెంకన్న, రేగ సురేందర్, మేడ కళా, వెంకట్, బిజ్జా రణధీర్, సోలం ప్రవీణ్, ఐలబోయిన భూపతిరావు, బొడ్డు రాములు, పూనెం సుధాకర్, శ్రీపతిరావు, పెనక అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గోల్లపూడి సుధీర్‌కు డాక్టరేట్



అక్షరశక్తి, కేయూ క్యాంపస్ : కాకతీయ విశ్వవిద్యాలయం చరిత్ర విభాగ పరిశోధక విద్యార్థి గోల్లపూడి సుధీర్‌కు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య రాజేందర్ కట్ల డాక్టరేట్‌ను ప్రకటించారు. చరిత్ర విభాగ ఆచార్యులు ఆచార్య టి. మనోహర్ పర్యవేక్షణలో "Entrepreneurial Strategies and Market Dynamics in Hyderabad's Medical Tourism Sector: A Quantitative Analysis" అనే అంశంపై సుధీర్ తన పరిశోధనను పూర్తి చేశారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణానికి చెందిన డాక్టర్ గోల్లపూడి సుధీర్‌ను పలువురు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సహకరిస్తాం



అక్షరశక్తి, ములుగు: జర్నలిస్టులు నిర్భయంగా ప్రజలకు వాస్తవాలను చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని ములుగు జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్‌నాథ్ అన్నారు. ఇటీవల నూతనంగా ఏర్పడిన తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేవీ) జిల్లా కమిటీ సభ్యులు గురువారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ కమిటీ సభ్యులకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. తన చాంబర్‌లో కమిటీ సభ్యులతో మాట్లాడిన ఎస్పీ జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, మీడియా భద్రత, సమాచార అందుబాటు వంటి అంశాలపై చర్చించారు. చట్ట పరిధిలో జర్నలిస్టులు తమ విధులు నిర్వర్తించేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ సహకరిస్తుందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి మీడియా, పోలీస్ శాఖ సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. జర్నలిస్టులకు ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కారానికి తాను అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా టీజేవీ జిల్లా కమిటీ సభ్యులు ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్పీని కలిసిన వారిలో టీజేవీ ములుగు జిల్లా అధ్యక్షుడు బేతి సతీష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎనగందుల కొమురయ్య, ఉపాధ్యక్షుడు చల్లగురుగుల రాజు, కోశాధికారి సంఘు రంజిత్‌కుమార్, సభ్యుడు బిక్షపతి తదితరులు ఉన్నారు.

పేదల పక్షాన నిలిచిన ప్రజావీరుడు పండుగ సాయన్న



అక్షరశక్తి, భూపాలపల్లి: పేదల పక్షాన నిలిచి అణచివేత, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన ప్రజావీరుడు పండుగ సాయన్న జీవితం నేటి తరానికి ఆదర్శమని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పండుగ సాయన్న జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని, సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల జానపద చరిత్రలో పండుగ సాయన్నకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. పేదలకు అండగా నిలవడం, బలహీన వర్గాల ఆత్మ గౌరవం కోసం పోరాడటం ఆయన జీవితంలో ప్రధాన విలువలని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, మానవత్వం, సేవాభావం పెంపొందించుకోవాలని సూచించారు. ప్రజల పట్ల బాధ్యతతో వ్యవహరిస్తూ బలహీన వర్గాలకు అండగా నిలవడం ద్వారా ఆయన ఆశయాలను భావితరాలకు అందించాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్‌కుమార్, ఆర్ఐలు కాశీరాం, పూర్ణచందర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనులను పరిశీలించిన సీఎం





అక్షరశక్తి, వికారాబాద్ : వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని ప్రసిద్ధి చెందిన శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణ పనులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పరిశీలించారు. పేదల తిరుపతిగా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయాన్ని అత్యంత వైభవంగా తీర్చిదిద్దే పనులు కొనసాగుతున్నాయి. ఆలయ పునర్నిర్మాణ పనులకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకుముందు ముఖ్యమంత్రి బాలాలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.

డిసెంబరులో జాతీయ స్థాయి క్రీడా సంబరం





- **దేశవ్యాప్తంగా అథ్లెట్ల రాక**
- **ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**

అక్షరశక్తి, హన్మకొండ : హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్) మరో ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి క్రీడా పోటీలకు వేదిక కానుంది. డిసెంబరులో నిర్వహించనున్న ఖేలో ఇండియా అథ్లెటిక్స్ పోటీల్లో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి గురువారం జేఎన్ఎస్ స్టేడియాన్ని సందర్శించి, పోటీల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్టేడియంలోని క్రీడా ప్రాంగణం, క్రీడాకారులకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, ఇతర ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. జాతీయ స్థాయి పోటీలకు హనుమకొండ ఆతిథ్యమివ్వనున్న నేపథ్యంలో ప్రతి అంశాన్ని ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సూచించారు.

క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించాలి

దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, కోచ్‌లు, సహాయక సిబ్బంది హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను ముందుగానే సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. వసతి, పారిశుధ్యం, తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని హనుమకొండ జిల్లా యువజన క్రీడల అధికారి కొత్త ప్రశాంత్‌కు ఆదేశించారు. పోటీల సమయంలో క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా సమన్వయంతో చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

స్టేడియంలో కొత్తగా నిర్మిస్తున్న మరుగుదొడ్లతోపాటు ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా, క్రీడా పోటీలు ప్రారంభమయ్యేలోపు అన్ని ఏర్పాట్లు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

కాంగ్రెస్ పార్టీ మరో 30 ఏళ్లు అధికారంలోకి రాదు

రాహుల్ గాంధీపై అమిత్ షా విమర్శలు



అక్షరశక్తి, డెస్క్ : రాబోయే 30 ఏళ్లలో కాంగ్రెస్ పార్టీ దేశంలో అధికారంలోకి వచ్చే అవకాశం లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ పార్టీకి అధికారం దక్కబోదన్నారు. న్యూఢిల్లీలో గురువారం యమునా నది పునరుద్ధరణ ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అమిత్ సా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాజా రాజకీయాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే 30 ఏళ్లలో కాంగ్రెస్ పార్టీకి, రాహుల్ గాంధీకి అధికారం దక్కబోదు. బూత్ స్థాయి కార్యకర్తల దగ్గరి నుంచి ప్రధాని మోదీ వరకు బీజేపీ నేతలు ప్రజలతో మమేకం అయి ఉంటారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తున్నారు. వోట్ చోరీ ఆరోపణలతో రాహుల్ గాంధీ, ఆయన అనుచరులు దేశంలోని చొరబాటుదారులు, అక్రమ వలసదారులకు మద్దతు ఇస్తున్నారు. వారి ఓటు హక్కును పరిరక్షించేందుకు ప్రయత్నిస్తున్నారనే విషయాన్ని దేశం మొత్తం అర్థం చేసుకుంది. కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలోని ప్రభుత్వం అధికారం చేపట్టేటప్పటికే.. అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ తన ఉనికి కోల్పోయింది. అనేక సందర్భాల్లో కోర్టులు రాహుల్‌కు అనుకూలంగా తీర్పు ఇస్తే అప్పుడు న్యాయం అంటారు.. అదే వ్యతిరేకంగా తీర్పు వస్తే కోర్టుల్నే ప్రశ్నిస్తారు. ఈ రకమైన ద్వంద ప్రమాణాలు పని చేయవు. ఢిల్లీ ప్రజల మనసు మార్చబోవు. ఢిల్లీలో 30 ఏళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్, కేజ్రీవాల్ ప్రభుత్వాలు పూర్తి వ్యర్థాల్ని యమునా నదిలో పదిలేశారు. హరియాణా, యూపీ నుంచి కాలుష్య వర్థాలు, కలుషిత నీరు నదిలో కలిసింది. అందుకే హరియాణా, యూపీ ప్రభుత్వాలతో కలిసి ఢిల్లీలోని బీజేపీ ప్రభుత్వం సమన్వయంతో పని చేస్తోంది. 2029లోపు యమునా నదిని ప్రక్షాళన చేయాలని భావిస్తోంది. పంజాబ్‌లో ఆప్ పాలనలో డ్రగ్స్ వ్యాపారం బాగా వృద్ధి చెందింది అని అమిత్ షా ఆరోపించారు.

రెడ్‌క్రాస్ సేవల విస్తరణకు ప్రాధాన్యత: కలెక్టర్ సత్య శారద



అక్షరశక్తి, వరంగల్: మానవతా సేవలు, రక్తదాన శిబిరాల నిర్వహణ, జూనియర్, యువజన రెడ్‌క్రాస్ విభాగాల విస్తరణకు ప్రాధాన్యత ఇవ్వాలని వరంగల్ జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు డా. సత్య శారద సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన రెడ్‌క్రాస్ జిల్లా నిర్వహణ కమిటీ తొలి సమావేశంలో ఆమె మాట్లాడుతూ, వయోవృద్ధుల కోసం 'ప్రణామ్' కార్యక్రమాలు నిర్వహించాలని, యువతలో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలని, నీటి పొదుపుపై ప్రజలకు చైతన్యం కలిగించాలని కోరారు. పేదలు, బాధితులకు సమన్వయంతో సేవలందించాలని, పాఠశాలలు, కళాశాలల్లో జూనియర్, యువజన రెడ్‌క్రాస్ విభాగాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వరంగల్‌లోని నూతన కలెక్టరేట్‌లో రెడ్‌క్రాస్ జిల్లా కార్యాలయానికి స్థలం కేటాయించాలని, ఎంజీఎం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితోపాటు నర్సంపేట, వర్ధన్నపేటలో జనరిక్ మందుల దుకాణాల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని కమిటీ సభ్యులు కలెక్టర్‌ను కోరగా, ఆమె సానుకూలంగా స్పందించారు. సమావేశంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బేతి అశోక్ బాబు, రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి. శ్రీనివాసరావు, నాడెం శాంతికుమార్, వైస్ చైర్మన్ శానబోయిన రాజ్‌కుమార్, కోశాధికారి బొల్లం శివ, ఇతర కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశం నిర్ణయం మేరకు ఇ.వి. శ్రీనివాసరావును రెడ్‌క్రాస్ వరంగల్ జిల్లా సలహాదారుగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

పేదరికం.. బాల్యంలోనే కుటుంబ బాధ్యతలు.. అయినా తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా సాగిన ప్రస్థానం ఆయనది. చదువుకునే వయసులోనే కులవృత్తిలోకి అడుగుపెట్టి, మరోవైపు తెలంగాణ ఉద్యమంలో తనదైన ముద్ర వేసిన ఉద్యమకారుడు గంధసిరి వేణు. తాడిచెట్లు ఎక్కిన చేతులే తెలంగాణ జెండాలను ఎగురవేశాయి. విద్యార్థి దశలో మొదలైన ఆయన ఉద్యమ ప్రస్థానం గ్రామస్థాయి పోరాటాల నుంచి రాజకీయ జేఏసీ వరకు కొనసాగింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం తెలంగాణ జాగృతిలోనూ కీలకంగా పనిచేశారు. తాజాగా కల్వకుంట్ల కవిత నేతృత్వంలోని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా వేణు నియమితులయ్యారు.

- అక్షరశక్తి, మహబూబాబాద్



జాగృతి నుంచి రక్షణ సేన వరకు..

కల్వకుంట్ల కవిత ఏర్పాటు చేసిన తెలంగాణ జాగృతిని డోర్నకల్ నియోజకవర్గంలో విస్తరించడంలో వేణు కీలక పాత్ర పోషించారు. జాగృతి యువజన విభాగం నియోజకవర్గ కన్వీనర్‌గా పలు పర్యాయాలు పనిచేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతోపాటు బీసీ ఉద్యమం, బహుజన వాదం, మలిదశ ఉద్యమకారుల సమస్యలపై జరిగిన పోరాటాల్లోనూ పాల్గొన్నారు. ఇటీవలి రాజకీయ పరిణామాల నేపథ్యంలో కవిత బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చి తెలంగాణ రక్షణ సేనను ఏర్పాటు చేయగా, వేణు ఆమె వెంట నడుస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర, సంస్థాగత అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు కవిత ప్రకటించారు.



పేదరికం నుంచి ఉద్యమ బాటకు..

ప్రస్తుత మహబూబాబాద్ జిల్లాలోని దాశరథి చిన్నగూడూరు గ్రామానికి చెందిన గంధసిరి వీరభద్రం, విమలమ్మ దంపతుల పెద్ద కుమారుడు వేణు. నిరుపేద కుటుంబంలో జన్మించిన ఆయన ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుకుంటూ, ఎనిమిదో తరగతి నుంచే కుటుంబ పోషణ కోసం 14 ఏళ్ల వయసులో తాడిచెట్లు ఎక్కే కులవృత్తిని చేపట్టారు. ఒకవైపు చదువు.. మరోవైపు కుటుంబ బాధ్యతల మధ్య పెరిగిన ఆయన, డిగ్రీ చదివే రోజుల్లోనే తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్)లో చేరి ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు.



ఉద్యమమే ఊపిరిగా..

జిల్లా పార్టీ పగ్గాలు వేణుకు!

తెలంగాణ రక్షణ సేన మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా గంధసిరి వేణు

విద్యార్థి దశ నుంచే తెలంగాణ ఉద్యమంలో క్రియాశీల పాత్ర

14 ఏళ్లకే కుటుంబ పోషణ కోసం కులవృత్తిలోకి..

జయశంకర్ స్ఫూర్తితో గ్రామగ్రామాన తెలంగాణ భావజాల వ్యాప్తి

తెలంగాణ జాగృతిలో కీలక భూమిక.. కవితతో కొనసాగుతున్న రాజకీయ ప్రస్థానం

ఉద్యమ నేపథ్యానికి ప్రాధాన్యమిస్తూ జిల్లా బాధ్యతలు

ఉద్యమ అనుభవమే పెట్టుబడిగా..

విద్యార్థి దశ నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం, రాజకీయ జేఏసీ, తెలంగాణ జాగృతి వరకు సాగిన వేణు ప్రస్థానం ఇప్పుడు జిల్లా పార్టీ బాధ్యతలకు చేరింది. ఉద్యమ నేపథ్యం ఉన్న నాయకుడికి బాధ్యతలు అప్పగించడంపై ఆయన అనుచరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొత్త పార్టీని జిల్లాలో బలోపేతం చేయడం, కార్యకర్తలను సమన్వయం చేయడం, స్థానిక సమస్యలపై కార్యాచరణ రూపొందించడం వేణు ముందున్న ప్రధాన బాధ్యతలు.







జయశంకర్ స్ఫూర్తితో గ్రామగ్రామాన..

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్, ప్రొఫెసర్ కోదండరామ్‌తోపాటు పలువురు తెలంగాణ ఉద్యమ ప్రముఖులతో కలిసి సెమినార్లు, సమావేశాల నిర్వహణలో వేణు కీలకంగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను ప్రజలకు వివరించేందుకు గ్రామగ్రామాన సభలు, సదస్సులు నిర్వహించారు. డోర్నకల్, మహబూబాబాద్ ప్రాంతాల్లో అప్పటి టీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, పార్టీ జెండా గద్దెల ఏర్పాటులోనూ భాగస్వాములయ్యారు. 2009 డిసెంబరు 9 తర్వాత ఉధృతమైన తెలంగాణ ఉద్యమంలోనూ క్రియాశీలంగా వ్యవహరించారు. మరిపెడ మండల తెలంగాణ రాజకీయ జేఏసీ కోఆర్డినేటర్‌గా పనిచేస్తూ గ్రామస్థాయి జేఏసీ కమిటీల ఏర్పాటుకు కృషి చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనతోపాటు మహబూబాబాద్ జిల్లా, దాశరథి చిన్నగూడూరు మండల ఏర్పాటు ఉద్యమాల్లోనూ పాల్గొన్నారు.



విద్యార్థి సంఘాల నుంచి జిల్లా బాధ్యతల వరకు..

2001–2003 మధ్య టీఆర్ఎస్వీ డిగ్రీ కళాశాల అధ్యక్షుడిగా, 2003–2006 మధ్య మహబూబాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా పనిచేశారు. తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ డోర్నకల్ నియోజకవర్గ కన్వీనర్‌గా, ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా, తెలంగాణ విద్యావంతుల వేదిక డివిజన్ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. 2006లో టీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థిగా వార్డు సభ్యుడి పదవికి పోటీ చేశారు. అనంతరం టీఆర్ఎస్వీ డోర్నకల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మహబూబాబాద్ జిల్లా టీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు బాధ్యతలు నిర్వహించారు.

నేడు కేయూలో నూతన బ్లాక్, సీసీ రోడ్డు ప్రారంభం

రూ.3.01 కోట్లతో నిర్మాణాలు

అక్షరశక్తి, కేయూ క్యాంపస్ : కాకతీయ విశ్వవిద్యాలయంలో నూతనంగా నిర్మించిన బ్లాక్2, సీసీ రోడ్డును శుక్రవారం ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ మేరకు విశ్వవిద్యాలయ అభివృద్ధి అధికారి ఆచార్య వై.వెంకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పరీక్షల విభాగంలో రూ.1.67 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన బ్లాక్2ను ప్రారంభిస్తారు. అనంతరం ఉదయం 10 గంటలకు స్పోర్ట్స్ కాంప్లెక్స్ నుంచి ఇంజినీరింగ్ కళాశాల కోఎడ్యుకేషన్ విభాగం వరకు రూ.1.34 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించనున్నారు. ఈ రెండు నిర్మాణాలకు మొత్తం రూ.3.01 కోట్లు వ్యయమైనట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమాలకు విశ్వవిద్యాలయ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు హాజరుకావాలని ఆచార్య వై. వెంకయ్య కోరారు.

అంతర్జాతీయ వేదికపై కేయూ అధ్యాపకుల పరిశోధనలు



అక్షరశక్తి, కేయూ క్యాంపస్ : అంతర్జాతీయ సదస్సులో పరిశోధనా పత్రాలు సమర్పించిన కాకతీయ విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, జర్నలిజం విభాగం అధ్యాపకుడు, ఆర్ట్స్ కళాశాల పీఆర్వో డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డిలను ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్‌రెడ్డి అభినందించారు. గురువారం తన చాంబర్‌లో వారిని సత్కరించి, పరిశోధనల ప్రాధాన్యాన్ని వివరించారు. సెప్టెంబర్ 24, 25 తేదీల్లో తమిళనాడులోని తిరుచిరాపల్లిలో ధనలక్ష్మి శ్రీనివాసన్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో వీరు తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ అధ్యాపకులు బోధనతోపాటు పరిశోధన రంగంలోనూ చురుకుగా పాల్గొని అంతర్జాతీయ వేదికలపై తమ పరిశోధనలను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ఉన్నత విద్యా ప్రమాణాల పెంపునకు పరిశోధనలు దోహదపడతాయని, నూతన ఆవిష్కరణలు, విజ్ఞాన విస్తరణలో అధ్యాపకుల కృషి కీలకమని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని విశ్వవిద్యాలయ ప్రతిష్ఠను పెంచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు డాక్టర్ చిర్రా రాజు, డాక్టర్ శ్రీధర్‌కుమార్, డాక్టర్ జితేందర్, హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్ట్‌టైం అధ్యాపకుల సర్వీసులకు రాటిఫికేషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలి

అక్షరశక్తి, కేయూ క్యాంపస్: కాకతీయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకుల సేవలను అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాల్లో పరిగణనలోకి తీసుకోవాలని కేయూ పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వై. రాంబాబు కోరారు. ఈ మేరకు గురువారం విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రమ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణలోని ఏడు విశ్వవిద్యాలయాల్లో 429 అధ్యాపక పోస్టుల భర్తీకి చేపట్టనున్న నియామక ప్రక్రియలో పార్ట్‌టైం అధ్యాపకుల సేవలకు గుర్తింపు లభించేలా రాటిఫికేషన్ సర్టిఫికెట్లు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై రిజిస్ట్రార్ స్పందిస్తూ పార్ట్‌టైం అధ్యాపకుల డిమాండ్లను ఉపకులపతి దృష్టికి తీసుకెళ్లి, రాటిఫికేషన్ సర్టిఫికెట్ల జారీకి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వారి సర్వీసులకు సంబంధించి ఉన్నత విద్యామండలి నుంచి కూడా వివరణ తీసుకుని న్యాయం జరిగేలా చూస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ నరేంద్ర నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ దేవోజి నాయక్, డాక్టర్ తిరునహరి శేషు, డాక్టర్ ఎర్రబొజ్జు రమేష్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ సాయికృష్ణ, డాక్టర్ శంకర్, డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే అంశంపై అధ్యయనం





- **ట్యాంక్‌బండ్ పరిసరాల్లో పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాలు**
- **కులగణన ఆధారంగా న్యాయపరమైన చిక్కులు లేకుండా నిర్ణయం**
- **మంత్రివర్గ ఉపసంఘం ద్వారా సమగ్ర పరిశీలన**
- **బహుజన పోరాటయోధులకు చరిత్రలో సముచిత స్థానం కల్పిస్తాం**
- **పండుగ సాయన్న 174వ జయంతి సభలో సీఎం రేవంత్‌రెడ్డి**

అక్షరశక్తి, హైదరాబాద్: ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీసీడీ నుంచి బీసీఏ గ్రూపులోకి మార్చే అంశంపై మంత్రివర్గ ఉపసంఘం సమగ్రంగా అధ్యయనం చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన వివరాల ఆధారంగా, న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా అన్ని అంశాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. నిరుపేదల కోసం పోరాడిన పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాలను ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గురువారం ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతి కార్యక్రమంలో సీఎం పాల్గొని మాట్లాడారు. తొలుత సాయన్న చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయనపై రూపొందించిన పాటలను ఆవిష్కరించారు.

కులగణన ఆధారంగా నిర్ణయం..

ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీసీడీ నుంచి మరో గ్రూపులోకి మార్చే ప్రతిపాదనలను గతంలో సరైన గణాంకాలు లేని కారణంగా న్యాయస్థానాలు తిరస్కరించాయని సీఎం గుర్తుచేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణనతో బీసీలకు సంబంధించిన లెక్కలు పక్కాగా ఉన్నాయని పేర్కొన్నారు. ముదిరాజ్‌లను బీసీఏలో చేర్చే అంశంపై మంత్రివర్గ ఉపసంఘం న్యాయనిపుణులు, అధికారులతో సంప్రదింపులు జరిపి సమగ్రంగా అధ్యయనం చేస్తుందని చెప్పారు. అనంతరం మంత్రివర్గంలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ముదిరాజ్‌లను బీసీఏలో చేర్చితే గంగపుత్రులకు అన్యాయం జరుగుతుందనే అనుమానాలు ఉన్నందున, ఆ వర్గాలతో చర్చించి అపోహలను తొలగించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సూచించారు.

సామాజిక న్యాయమే లక్ష్యం..

స్వతంత్ర భారతదేశంలో తొలిసారిగా జనగణనలో కులగణన చేపట్టి రాష్ట్ర ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలిచిందని రేవంత్‌రెడ్డి అన్నారు. 2024 ఫిబ్రవరి 4న కమిషన్‌ను ఏర్పాటు చేసి, ఏడాదిలోగా 2025 ఫిబ్రవరి 4 నాటికి కులగణన వివరాలను సేకరించామని తెలిపారు. ఈ లెక్కలు బలహీనవర్గాలకు తమ హక్కులను అడిగే ధైర్యాన్ని కల్పించాయని పేర్కొన్నారు. కులగణనలో ఎవరి వివరాలైనా నమోదు కాకపోతే లేదా లెక్కల్లో తప్పులు ఉన్నట్లు భావిస్తే సరిచేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఈ విషయంలో సానుకూలంగా ఉందని, విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో సామాజిక న్యాయం జరిగేలా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తామని చెప్పారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణ అంశం నాలుగు దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉండగా, ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిష్కరించామని సీఎం పేర్కొన్నారు. జటిలమైన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ, ఎవరికీ అన్యాయం జరగకుండా చూడటం తన బాధ్యత అని అన్నారు.

పోరాటయోధులకు సముచిత గుర్తింపు..

నిరుపేదలు, బహుజనుల భూములను రక్షించేందుకు పండుగ సాయన్న పోరాటం చేశారని సీఎం కొనియాడారు. జమీందార్లు, జాగీర్దార్లు, భూస్వాములకు వ్యతిరేకంగా ధైర్యంగా నిలిచి పేదల పక్షాన పోరాడిన ఆయనను ఇప్పటికీ పల్లెల్లో జానపదాల రూపంలో స్మరించుకుంటున్నారని చెప్పారు. పండుగ సాయన్న పాలమూరు బిడ్డ కావడం గర్వకారణమని, ఆయన చరిత్రకు సముచిత స్థానం కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. సర్వాయి పాపన్న గౌడ్, దొడ్డి కొమురయ్య, కొండా లక్ష్మణ్ బాపూజీ, జ్యోతిరావు పూలే, చాకలి ఐలమ్మ వంటి బహుజన పోరాటయోధుల సేవలను గుర్తుచేశారు. సర్వాయి పాపన్న గౌడ్, జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాల తరహాలోనే ట్యాంక్‌బండ్ పరిసరాల్లో పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నాం..

రాష్ట్రంలో గత ప్రభుత్వాలు అమలు చేసిన సంక్షేమ పథకాలను రద్దు చేయకుండా మరింత మెరుగుపరిచి అమలు చేస్తున్నామని సీఎం వివరించారు. రాష్ట్రంలో 3.48 కోట్ల మందికి ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే 55 లక్షల కుటుంబాలకు ఉచిత గృహ విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని, రైతు భరోసా మొత్తాన్ని రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంచామని పేర్కొన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం ఇప్పటివరకు రూ.14 వేల కోట్లకు పైగా వెచ్చించిందన్నారు. 25 లక్షలకు పైగా రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని, నిరుపేదలకు ఎనిమిది లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని చెప్పారు. షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకాలను కూడా కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్, ఎంపీలు ఈటల రాజేందర్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

లంచం ఆరోపణలపై ఇద్దరు ప్రాజెక్టు అధికారులు అరెస్టు

- **బిల్లుల చెల్లింపునకు 10 నుంచి 25 శాతం డిమాండ్..**
- **రూ.39.17 లక్షలు బదిలీ అయినట్లు గుర్తింపు**

అక్షరశక్తి,భూపాలపల్లి: భూపాలపల్లి జిల్లాలోని భాగీరథిపేట ప్రాజెక్టులో పీఎంకేఎస్‌వై 2.0 విభాగానికి చెందిన ప్రాజెక్టు అధికారి సతీశ్‌రెడ్డి, సాంకేతిక అధికారి రాజును అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వరంగల్ రేంజ్ అధికారులు గురువారం అరెస్టు చేశారు. పనుల బిల్లుల మంజూరు, తదుపరి పనుల కేటాయింపు కోసం గుత్తేదారు నుంచి బిల్లు మొత్తంలో 10 నుంచి 25 శాతం వరకు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. డబ్బులు చెల్లించకపోతే బిల్లులు నిలిపివేస్తామని బెదిరించినట్లు గుత్తేదారు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విచారణ చేపట్టిన ఏసీబీ అధికారులు వివిధ బ్యాంకు, యూపీఐ ఖాతాల ద్వారా మొత్తం రూ.39,17,000 బదిలీ అయినట్లు గుర్తించారు. ఇందుకు సంబంధించిన బ్యాంకు ఖాతాల వివరాలు, వాట్సాప్ సంభాషణలను ఫిర్యాదుదారు ఆధారాలుగా అందజేశారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన అధికారులు ఇద్దరు ప్రాజెక్టు అధికారులను అరెస్టు చేసినట్లు తెలిపారు.



GUEST COLUMN

ఈ గాలీ! ఈ నేలా! – మతసామరస్యాన్ని చాటిన మానవీయ కథ



- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
9849328496
ramkishore.1504@gmail.com

తెలుగు కథా సాహిత్యంలో సామాజిక సమస్యలను మానవీయ కోణంలో పరిశీలిస్తూ, మనుషుల మధ్య ప్రేమానుబంధాలను, సమాజంలో వేళ్లూనుకున్న అపోహలను కథావస్తువులుగా మలచడం రచయితల ప్రత్యేకత. సమ్మెట ఉమాదేవి రచించిన 'ఈ గాలీ! ఈ నేలా!' అటువంటి ఆలోచనాత్మక కథ. మతం పేరుతో మనుషుల మధ్య పెరుగుతున్న అనుమానాలను ప్రశ్నిస్తూ, మానవత్వమే అన్నిటికంటే గొప్పదనే సందేశాన్ని అందించిన రచయిత్రి ప్రయత్నం అభినందనీయం.

రచయిత్రి పరిచయం:

రచయిత్రి గురించి చిరు పరిచయం:

రచయిత్రి సమ్మెట ఉమాదేవి ఖమ్మం జిల్లాలో నివాసమున్న విశ్రాంత ఉపాధ్యాయిని (ప్రస్తుతం పదవీ విరమణ తరువాత హైదరాబాద్ లో ఉంటున్నారు). వీరి తల్లిదండ్రులు సమ్మెట పోతరాజు, లక్ష్మీ తులసీబాయ్ గార్లు, గారాల తనయలు నిహారికా శ్రీనివాస్, నివేదితా దినేష్, కవీర్ణలు.

ఇప్పటిదాకా.. వచ్చిన పుస్తకాలు:

అమ్మ కథలు, రేలపూలూ-తండా వాసుల కథలు, జమ్మిపూలు, సమ్మెట ఉమాదేవి కథానికలు అనే కథా సంపుటాలను వెలువరించారు. విజయవాణి పబ్లిషర్స్ ద్వారా.. అల్లరి కావ్య, పిల్లల దండు, నిజాయితి, పిల్లిముసుగు అనే బొమ్మల కథా పుస్తకాలు వచ్చాయి.

స్వాతీ పబ్లిషర్స్ ద్వారా.. రామకృష్ణ పరమహంస జీవిత చరిత్ర-పిల్లల బొమ్మల పుస్తకం వచ్చింది.

తానా-మంచి పుస్తకం వారి సంయుక్త ప్రచురణలో.. ఏమి చేస్తారు? ఏమేమి చేస్తారు? అనే బొమ్మల కథా పుస్తకం వెలువడింది.

ఇటీవల... మా పిల్లల ముచ్చట్లు - ఒక టీచర్ అనుభవాలు, నిక్ -అంటే ప్రేరణ - నిక్ వుయినిచ్ విజయ గాధ అనే పుస్తకాలను వెలువరించారు.

ఇప్పటి వరకు అనేక సాహిత్య, సాంస్కృతిక సంస్థలని పలు ప్రతిష్టాత్మక పురస్కారాలు పొందారు.వారి రచనలపై ఇప్పటికే వారు రాసిన " రేల పూలు " పుస్తకం హిందీలో అనువాదం అయింది. వివిధ విశ్వవిద్యాలయాల్లో పరిశోధకులకు పలు ఎం.ఫిల్స్ ; ఒక పీహెచ్.డీ పట్టాలు కూడా లభించాయి.వారి మిగతా రచనలు ఇతర భాషల్లో అనువాదాలు జరుగుతున్నాయి.

ఈ కథ ప్రత్యేకత:

ఈ కథ...'నమస్తే తెలంగాణ-ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2026'లో ప్రత్యేక బహుమతి రూ.5 వేలు పొందిన కథ.


సమ్మెట ఉమాదేవి

సంక్షిప్తంగా కథ పరిచయం:

కథలో నిరుపమ, సూర్యం దంపతుల కుమార్తె నేత్రకు అప్రఫ్‌తో పరిచయం ఏర్పడుతుంది. సూర్యం అన్న కుమారుడు భరత్ ద్వారా వారి ఇంటికి వచ్చిన అప్రఫ్, తన మంచితనంతో కుటుంబ సభ్యులకు దగ్గరవుతాడు. అయితే అతను ముస్లిం అని తెలిసిన తర్వాత నిరుపమలో అంతవరకు బయటపడని మతపరమైన వ్యతిరేకత క్రమంగా వ్యక్తమవుతుంది. నేత్ర, అప్రఫ్‌ల మధ్య ప్రేమ పెరగడంతో ఆమె ఆందోళన మరింత తీవ్రమవుతుంది. ప్రేమకు మతం అడ్డంకి కాకూడదని భావించే యువతరానికి, సంప్రదాయ భయాలు, సామాజిక ఒత్తిళ్ల మధ్య కొట్టుమిట్టాడే పెద్దతరానికి మధ్య జరిగే సంఘర్షణే ఈ కథకు ప్రధాన ఆధారం.

ఈ కథపై సమీక్ష:

నిరుపమ ఈ కథలో కీలకమైన పాత్ర. పైకి ఆధునికంగా కనిపించినా, మొదటి నుండీ ముస్లింల పట్ల సమాజంలో ఏర్పడిన అనుమానాలు, జరిగిన ప్రచారం, ముఖ్యంగా గత 12 ఏళ్ళుగా ముస్లింల పై దేశంలో దిన పత్రికలు,టివి,ఇతర సోషల్ మీడియా సమాచార,ప్రచార సాధనాల ద్వారా పెరిగిన అనుమానాలు, అపోహల అపనమ్మకాల ప్రభావం మరింతగా ఆమె మనో ఫలకంపై బలంగా ముద్ర వేశాయి ఉన్నాయి.

అప్రఫ్ ప్రవర్తన,కలుపుగోలుతనం, వ్యక్తిత్వాన్ని అభిమానించినప్పటికీ, అతని మతాన్ని అంగీకరించలేకపోవడం ఆమెలోని ద్వంద్వ స్వభావాన్ని వెల్లడిస్తుంది. ఒక వ్యక్తి మంచివాడని తెలిసినా, అతని మతం వేరైనంత మాత్రాన అతనిపై అనుమానం పెంచుకోవడం మన సమాజంలో ఉన్న విరోధాభాసానికి ప్రతిబింబం. కూతురిపై ప్రేమ, ఆమె భవిష్యత్తుపై ఆందోళన ఒకవైపు, మతపరమైన అసహనం, అపోహలు నిరుపమను మానసిక సంఘర్షణకు గురిచేస్తాయి. వ్యక్తులను వారి ప్రవర్తన ఆధారంగా కాకుండా, మతపరమైన గుర్తింపుల ఆధారంగా అంచనా వేయడం ప్రమాదకరం. కథలో నిరుపమ అప్రఫ్‌పై చూపే అనుమానం ఈ సామాజిక ధోరణిని స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. అయితే ఆమె భయాన్ని కేవలం వ్యక్తిగత దురభిప్రాయంగా చూపకుండా, కుటుంబం, బంధువులు, సమాజం కలిగించే ఒత్తిళ్లతో ముడిపెట్టడం రచయిత్రి దృష్టిలోని విస్తృతిని తెలియజేస్తుంది. అప్రఫ్ ఈ కథలో మానవత్వానికి ప్రతీకగా నిలుస్తాడు. నిరుపమ మాటలతో బాధపడినా, ఆమెను ద్వేషించకుండా ఆప్యాయతతోనే స్పందిస్తాడు. "ఈ గాలీ.. ఈ నేలా.. మీదీ మాదీనూ" అనే అతని మాటలు కథకు ప్రాణం పోస్తాయి. పుట్టుకను మనుషులు ఎంచుకోలేరు; మతం ఆధారంగా దేశంపై హక్కులను నిర్ణయించలేమనే సత్యాన్ని అతను సరళంగా చెబుతాడు.

నేత్ర కూడా తన వ్యక్తిత్వాన్ని, తన మతాన్ని కోల్పోకుండా అప్రఫ్‌తో కలిసి జీవించాలని కోరుకోవడం ద్వారా స్వతంత్ర ఆలోచన కలిగిన ఆధునిక యువతిగా కనిపిస్తుంది. సూర్యం, భరత్, అప్రఫ్ తల్లిదండ్రులు కథలోని ఇతర పాత్రలు. వీరి ద్వారా కుటుంబ బంధాలు, పరస్పర సహకారం, సహజీవన విలువలు వ్యక్తమవుతాయి.

కథ చివరి భాగంలో నేత్ర ఇంటికి రాకపోవడం, అప్రఫ్ ఫోన్ అందుబాటులో లేకపోవడం నిరుపమలో భయాన్ని పరాకాష్ఠకు తీసుకెళ్తాయి. నిజానిజాలు తెలుసుకోకముందే అప్రఫ్‌పై అపహరణ, అక్రమ రవాణా వంటి తీవ్రమైన ఆరోపణలు చేయడం ఆమె మనసులోని మతపరమైన అనుమానాలు ఎంత లోతుగా పాతుకుపోయాయో తెలియజేస్తుంది. అయితే అదే అప్రఫ్ రాత్రంతా వెతికి, ఆసుపత్రిలో ఉన్న నేత్రను గుర్తించి, ఆమెను క్షేమంగా ఇంటికి తీసుకురావడం కథలో కీలకమైన మలుపు. అతని ఆచరణే నిరుపమ అనుమానాలకు సమాధానంగా నిలుస్తుంది. చివరలో అప్రఫ్ తల్లిదండ్రులు నమాజు చేసుకుంటున్న దృశ్యం, నిరుపమ వారిని అంగీకరించే దిశగా మారుతున్న మానసిక స్థితికి సంకేతంగా కనిపిస్తుంది. కథను ఆసక్తికరంగా నడిపించడంలో రచయిత్రి మంచి నేర్పును ప్రదర్శించారు. ప్రారంభంలోనే నేత్ర కనిపించకపోవడం ద్వారా ఉత్కంఠను సృష్టించి, గత సంఘటనలను మధ్యలో వివరించి, చివరలో అపోహలను తొలగించే పరిష్కారానికి చేరుకుంటారు. సహజమైన సంభాషణలు, సరళమైన భాష, పాత్రలకు తగిన మాటతీరు కథను పాఠకులకు దగ్గర చేస్తాయి. ముఖ్యంగా అప్రఫ్ సంభాషణల్లో హాస్యం, ఆవేదన, ఆత్మవిశ్వాసం సమతుల్యంగా కనిపిస్తాయి. అయితే నేత్రకు వచ్చిన ఆహార విష ప్రభావం, బాధకు సంబంధించిన పరిస్థితులను, కుటుంబ సభ్యుల స్పందనలను మరింత విపులంగా చూపితే కథలోని వాస్తవికత మరింత బలపడేది.

మొత్తంగా 'ఈ గాలీ! ఈ నేలా!' మతసామరస్యం గురించి ఉపన్యాసం చేయకుండా, మనుషుల అనుబంధాల ద్వారా ఒక గొప్ప సత్యాన్ని ఆవిష్కరించిన కథ. మతాలు వేరైనా మనుషుల భావోద్వేగాలు, ప్రేమ, బాధ్యతలు ఒక్కటేనని గుర్తుచేస్తుంది. పరస్పర అనుమానాల స్థానంలో విశ్వాసం, ద్వేషం స్థానంలో ఆప్యాయత, విభజన స్థానంలో సహజీవనం రావాలని ఆకాంక్షిస్తుంది. సమాజాన్ని ఆలోచింపజేసే ఇటువంటి కథలను అందించిన సమ్మెట ఉమాదేవి అభినందనలకు అర్హులు. ఆమె కలం నుంచి మరిన్ని మానవీయ, సామాజిక స్పృహ కలిగిన కథలు వెలువడాలని కోరుకుందాం.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.